# నిశ్శబ్దం. టి.ఎస్. హరగోపాల్

నిశ్శబ్దం.

నిస్...శబ్దం

ఏమీలేదు – శూన్యం

శూన్యం నుంచి శబ్దం పుట్టింది.

శబ్దం.....ఓంకారం

'ఓం'కారం నుంచి 'ఆకారం' పుట్టింది.

ఆకార స్వరూపుడైన భగవంతుడు ఆవిర్భవించాడు.

ఆ ఆకారాన్ని ఆసరాగా చేసుకుని, అన్యాయం పుట్టింది.

ఆ అన్యాయాన్ని ఎదిరించలేని న్యాయదేవత కళ్ళు మూసుకుంది.

న్యాయాన్ని, అన్యాయాన్ని విడదీసి చూడగలిగేవి కళ్ళు.

రెండు జంటల కళ్ళు ఆకాశంలోకి చూస్తున్నాయి.

"మామా, నక్షత్రాలు తుంపరలు తుంపరలుగా విసిరేసినట్లుగా వున్నాయేంటి?"

"అవి నక్షత్రాలు కావు, చందమామ"

పరీక్షగా చూసింది ఆమె.

నిజమే....చందమామ

దట్టంగా, గుబురుగా అడవి తీగలు అల్లుకున్న ఆకుల మధ్య నుంచి చందమామ నిండుగా కన్పడడంలేదు.

ఆమె అతని చేతిని తన గుండెలమీదకు తీసుకుంది.

అడవిపూలవాసన కమ్మగా ముక్కుపుటాలకు తగులుతోంది. నిలువెత్తుగడ్డి. గజం దూరంలో వున్నవార్ని కూడా గుర్తుపట్టలేనంత దట్టంగా వుంది. గాలి తేమగా వుంది. చలి మరింత ఎక్కువైంది. చలికి వళ్ళు బిగుసుకుపోతోంది.

అడవి జంతువులు దగ్గరకు రాకుండా వుండేందుకు పెద్ద నెగడు వేయడంతో ఆ ప్రదేశం అంతా పట్టపగలులా, ఎర్రటి వెల్తురుతో నిండిపోయింది.

పడుకునేందుకు ప్లాస్టిక్ పేపర్ కాని, కప్పకునేం



దుకు ఉలెన్ రగ్గు లేదు.

ఆచ్ఛాదనలేని ఆ శరీరాలు చలిని అనుభవిస్తు న్నాయో, వెగడు మంటల వెచ్చదనాన్ని అను భవిస్తున్నాయో....

చలికి, మాటకి అతీతంగా......

వేడెక్కిన శరీరాల్ని చల్లబరచుకుంటున్నాయో.....

ఈ అనంత విశ్వంలో అందరూ అడుగుతూనే, సమాధానం దొరకని ప్రశ్న.

ఆమె అతని చేతిని సుతారంగా లాగుతూ, దగ్గ రకు తీసుకుంది.

ఆ నిశ్శబ్దంలో....

ఆ ఆకాశం క్రింద....

పాలమీగడలాంటి వెన్నెలలో....

చంద్రుడు, తారకలు ఫక్కున నవ్వుకుని... సిగ్గుపడి, మబ్బులచాటుకి పరుగిడగా....

ఆ జంట ఏకమై....

అలసి, సొలసి...

ఉచ్ఛ్వాస, నిశ్వాసాలే శబ్దాలుగా మారినవేళ....

"మామా, మనూరు వెళ్ళిపోదామా" ఆమె అడి గింది, అతను 'కాద'నలేని మానసికస్థితిలో వున్నప్పుడు.

తన జీవితాన్ని పంచుకున్న అర్ధాంగి, తన సర్వ స్వాన్ని తనకు సమర్పించి, ఆనందపుటంచులకి తీసుకువెళ్ళినవేళ....

ఆమె స్త్రీ...

ప్రకృతి....

దైవం సాధించలేనిది ప్రకృతి సాధిస్తుంది.

ప్రకృతికి ప్రపంచాన్ని జయించగల సామర్థ్యం వుంది.

అతను 'కాద'నలేదు.

'సరే'ననలేదు.

'కాద'నకపోవడం ఆమె తొలి విజయం.

"మామా, మనం సాధించిందేమిటి?'' ఆమె నెమ్మదిగానే ప్రశ్న వేసింది.

దూరంగా పెద్ద ఉరుము.

ఉరుములు, మెరుపులతో పెద్దగా వర్షం కురు స్తోంది. కరెంటు పోయింది.

ఓ పల్లెటూరులో, జమ్మితో కప్పిన ఓ చిన్నఇం టిలో, కిటికీ తలుపుల మధ్య నుంచి వీస్తున్న చల్లనిగాలిని తట్టుకోడానికి....

వెచ్చని దుప్పట్లు లేని ఆ జంట....

ఒకరి శరీరంతో యింకొకరి శరీరాన్ని పెనవేసు కునివున్న వేళ...

ఉరుముకీ, మెరుపుకీ మధ్య తలుపుపై ధబ దబ చప్పుడవుతుంటే...

ఆమె తన చీరని సరిచేసుకుంది.

అతను లుంగీ దోపుకుంటూ....

"ఎవరదీ" అంటూ తలుపు తెరిచాడు.

"బయట వర్షంగా వుంది. కొద్దిగా లోపలకు రానిస్తారా"– యిద్దరు యువకులు.

ఆదరణకి ప్రతీకలు పల్లెసీమలు.

ఆ నిశీథిలో, భయంకరమైన వర్షపు వాతావర ణంలో, ఆ ఆగంతకులకి ఆతిథ్యమిచ్చారు ఆ దంపతులు.

ఆ పేదవాళ్ళు పెట్టిన చద్ది అన్నం, మజ్జిగలో ఆప్యాయత వాళ్లని ఆ దంపతుల దగ్గరకు చేర్చింది.

అప్పుడప్పుడూ వస్తుండేవారు, రాత్రి సమయాల్లో. కబుర్లు చెప్పేవారు.

కబుర్లు వినేవారు.

"పెద్దిరెడ్డి, చిన్నిరెడ్డి అన్ని అకృత్యాలు చేస్తు న్నారా?"

"అవును బాబూ, మా బాబాయి కూతురుని పెద్దిరెడ్డి బలవంతంగా చెరిస్తే ఆమె ఉరిపో సుకుంది. చిన్నిరెడ్డి మా ఆవిడని పొలంలో అల్లరిచేయబోతే, ఈ ఊళ్లో డాక్టరుబాబు అడ్డు పడి రక్షించాడు. ఉన్న రెండకరాలు పండీ పండక కష్టాలు పడుతూవుంటే, చేసిన అప్పు లపైన వడ్డీలపై వడ్డీలు గుంజి, రెండెకరాల పొలం రాయించేసుకునేటట్లున్నారు"

"మరి మీరెందుకు ఎదురు తిరగరు?"

ఉలిక్కిపడ్డాడు వీరయ్య. "ఎదురు తిరగడమా? ఎదురుతిరిగి బతకగలమా? పోలీసులు కూడా వాళ్ళమాటే వింటారు".

శేఖర్, "వాళ్ళని కాల్చేయాలి" అన్నాడు ఆవే శంగా.

"ఏం అన్నా, కాల్చేయడానికి నీ దగ్గరేమైనా తుపాకులున్నయా"–నవ్వుతూ అడిగింది లక్ష్మి.

"తుపాకీ వుంటే కాల్చేస్తావా చెల్లమ్మా", రవి అడిగాడు.

"ఆ రావణాసురులిద్దర్నీ కాల్చేసినా పాపం లేదు. అలాంటివాళ్లని కాల్చిచంపి, జైలుకెళ్లినా ఫర్వాలేదు" ఆమె ఆవేశ అ. చి.

"మా దగ్గర తుపాకులున్నయ్, రేపు చూపిస్తాం రండి", అన్నాడు శేఖర్.

వాళ్ళు నమ్మలా.

నమ్మకం కుదర్చడంకోసం వాళ్ళిద్దరినీ శేఖర్, రవి తమవెంట తీసుకువెళ్ళారు.

వెంకయ్య, లక్ష్మి ఆశ్చర్యంగా చూశారు.

ఇన్ని వందల, వేల తుపాకులు, యింత మందుగుండు సామగ్రి....

"ఇవి ఎకె–47 రైఫిల్స్...పిస్టల్స్...తూటాలు... బాంబులు తయారుచేయడానికుపయోగించే కెమికల్స్. ..హాండ్ గ్రెనేడ్స్, చేతిబాం బులు...వైర్‌లెస్ సెట్లు...వాకీటాకీ అని చాలా పవర్‌ఫుల్ రెండువైపుల మంచి సమా చారాన్ని యిచ్చి, పుచ్చుకునే పరికరం..... సైన్యంలో ఉపయోగించే బూట్లు....వెల్డింగ్ పరి కరాలు....మందులు.....ఆంటిన్నాల్లా ఉపయోగ పడే ఏరియల్స్...ఆహారసామగ్రి తెచ్చే లారీలు.... బంగారం.... ఇదంతా విప్లవ సాహిత్యం....", రవి, శేఖర్ వాళ్ళిద్దరికీ చెప్తుకుంటూ వెడుతు న్నారు.


ఆ అడవుల్లో ఎంతో ఓర్పుతో అక్కడున్న యువతీ యువకులకు ట్రైనింగ్ ఇస్తున్నారు. అడవినిండా గ్రూపులు గ్రూపులుగా యువతీ యువకులు తర్ఫీదు పొందుతున్నారు.

"శిల్లవాడు నిన్న నాడు భగత్సింగు అన్నాడు. నల్లవాడు నిన్న నేడు నక్సలైటు అన్నాడు. యిల్లవారు నిన్న రేపు వేగుచుక్క అంటారు" అన్నారు.. శ్రీశ్రీగారు.

.ఎవరో ఉపన్యసిస్తున్నారు.

"ప్రజలను దోచుకొనడం వంటి బాధాకరమైన సంఘటనలు జరుగుతున్నాయి. ఇది మనకు చాలా అవమానకరం."

రవి చెప్పాడు, "ఈ గిరిజనుల్ని గిరిజనేతరులు దోపిడీ చేస్తున్నారు. పట్టా గిరిజనుల పేరనే వున్నా, గిరిజనేతరులే దానిని అనుభవిస్తున్నారు. వీళ్లంతా... కొండదొరలు, బుగతలు, కొండ



కాపులు, మాలీలు, వాల్మీకులు, పురజాలు... ఈ తెగలవారందరూ, తరతరాలుగా దోపిడీకి గురికాబడ్డారు"

"సమానత్వం, స్వాతంత్ర్యం, సామాజిక న్యాయం అందరికీ అందాలి. అన్యాయానికి అడ్డుకట్ట వేయాలి"

"రాజులు పోయారు. ఇది ప్రజాస్వామ్య యుగం. సామాన్యుల అవసరాలను తీర్చాలి. నోరులేని మూగజీవి కడుపుకొట్టడం సహించం"

"దేశానికి వెన్నెముక, జాతికి అన్నదాత అని పొగుడుతూ, రైతును నిదురపోరా తమ్ముడూ అని జో కొడుతూ వచ్చాయి ఈ ప్రభుత్వాలు. రాచరికపు పోకడలు సాగించే భూస్వాములు సన్నకారు రైతులను మోసంచేసి దోపిడీ చేస్తున్నారు. ఎవరో వస్తారని, ఏదో చేస్తారని ఎదురుచూస్తూ, నిమ్మకు నీరెత్తినట్లు కూర్చుంటే, రైతుల తలరాత మారదు. పరమచైతన్య రహితులుగా వున్న రైతులు సంకుచిత భావాల్ని భూస్థాపితం చేసి ఏకోన్ముఖులై భూస్వాముల్ని ప్రతిఘటించాలి.

"ప్రజల్ని నానారకాలుగా అణచివేస్తున్న దుష్టశక్తుల నుంచి ప్రభుత్వం ప్రజల్ని రక్షించలేనప్పుడు ప్రజలు హింస, అధీకృత హింసల్ని ప్రతిహింసతో ఎదుర్కొనడం నేరం కాదు. ప్రతి హింస రాజ్యాంగ వ్యతిరేకమైనా, దానికి కారణం ప్రభుత్వమే గానీ ప్రజలు కారు".

నాయకులు యిచ్చే ఉపన్యాసాలు ఎంతో హేతుబద్ధంగా వున్నాయి.

అన్యాయంపైన న్యాయపోరాటం. బలవంతుల దోపిడీపై బలహీనుల తిరుగుబాటు. బూర్జువాల అణచివేతపై పేదవాడి ఎదురీత.

వెంకయ్య, లక్ష్మిల రోమాలు నిక్కబొడుచుకున్నాయి.

నిజంగా సాధ్యమా!

"వెంకయ్యా! పెద్దరెడ్డిని ఈ తుపాకీతో కాలుస్తావా? చెల్లమ్మా, నీ చీర పట్టుకున్న చిన్నరెడ్డి చేతులు నరికేస్తావా, చెప్పు..."

"ఏముంది, రెండెకరాలు...అప్పుపైన వడ్డీకే సరిపోతుంది. జీవితమంతా బానిసబతుకే. మా దగ్గరకు వచ్చేయండి. ఆ పెద్దరెడ్డి, చిన్నరెడ్డి లాంటి వాళ్ళని కాల్చిచంపేయచ్చు. స్వాతంత్ర్యానికర్థం లేని ఈ దేశంలో నిజంగా స్వతంత్రంగా బతకొచ్చు"

వెంకయ్య, లక్ష్మి ఆలోచనలో పడ్డారు.

పెద్దరెడ్డిని నరికేయడం....

చిన్నరెడ్డిని చేతులు నరికేయడం...

ఈరోజూ చచ్చి బతికే బతుకు గడపకపోతేమేం!

'అంత' చదూకున్న 'అన్న'లిద్దరూ 'ఇంత'గా దేశంకోసం కష్టపడ్తూంటే-

కొన్నివందల మంది యువతీ యువకులు ఆ అరణ్యాల్లో వుంటూ,

దేశప్రజ కోసం కష్టపడుతూ వుంటే...

'తామిద్దరం' తమ వంతు కర్తవ్యం నిర్వర్తించలేకపోతే.....

వాళ్లిద్దరూ 'అన్న'లతో అడవుల్లోకి వెళ్లారు.

నాగలిపట్టిన చేతులతో తుపాకీ పట్టారు.

చల్ది అన్నం పెట్టి, చల్లని మాటలు చెప్పే వాళ్లు బూర్జువాల దోపిడీలపై ఉపన్యాసాలిచ్చే స్థితికి ఎదిగారు.

భాష మారింది.

భావాలు మారాయి.

వెంకయ్య 'వెంకన్న' అయ్యాడు.

లక్ష్మి 'లక్ష్మక్క' అయింది.

ఊళ్లో వాళ్ళు పొలం చేసుకోలేక అప్పులు తీర్చలేక వాళ్లిద్దరూ ఊరు విడిచి వెళ్లిపోయారనుకున్నారు.

పెద్దరెడ్డి, చిన్నరెడ్డి ఆ రెండెకరాలు తమ



'స్లాగు'లో కలిపేసుకున్నారు.

పెద్దిరెడ్డి పంటను బండిమీద వేసుకు వెడుతున్నాడు.

ఎదురుగా వెంకన్న.

"ఏరా! ఊరు, పొలం గుర్తుకొచ్చిందా పంట చూసేసరికి," బిగ్గరగా నవ్వుతూ అన్నాడు పెద్దిరెడ్డి

"నవ్వు, ఇంకా నవ్వు... ఇంకా నవ్వడానికి మిగలవంతగా నవ్వు" అంటూ వెంకన్న పెద్దిరెడ్డిపై రైఫిల్‌తో కాల్పులు జరిపాడు.

ఒక తూటా అతని తలను తాకింది. కుడి కన్ను పూర్తిగా చీలిపోయింది. రెండవ తూటా అతని ఛాతీలో నుంచి దూసుకుపోయింది. పెద్దిరెడ్డి నేల కొరిగాడు.

ఊళ్లో అందరూ వెంకయ్య, లక్ష్మిలు నక్సలైట్లలో చేరారన్నారు.

ఊళ్లోకి పోలీసులు దిగారు. ఎ.వ్వతి సంబంధమున్నవాళ్లనందరినీ ప్రశ్నలతో వేధిస్తున్నారు.


చుట్టూ ఎత్తయిన కొండలతో, ఊళ్ళమధ్య నుంచి పక్కల నుంచి పారే పంట కాల్వలతో కళ కళలాడే ఆ గ్రామం చడీ చప్పుడూ లేకుండా నిర్జీవమైపోయింది. పల్లెపడుచుల కాలి అందెల సవ్వడితో, పశువుల అంబారావాలతో సందడిగా వుండే ఆ గ్రామం మూగబోయి, నిర్మానుష్యంగా కన్పించింది. ఆ ఊరు స్మశాన నిశ్శబ్దంలో పడిపోయింది. జీపు చప్పుడు వినిపిస్తే గ్రామ ప్రజలు భయంతో పారిపోతున్నారు.

చిన్నిరెడ్డి భద్రతకోసం పక్కవూళ్ళో అత్తారింటికి పారిపోయాడు. భార్యతప్ప ఊళ్లో అందరు ఆడవాళ్ళూ తనసొత్తు కావాలనుకొంటాడతను.

పెళ్లానికి ఎప్పుడో లేని జబ్బువంటగట్టాడు. అన్నీ తెలిసిన ఆమె కనపడని దైవానికి మొక్కుకుంటూ వుంటుంది, తన భర్త అన్యాయాలు చేసినా తనకి అన్యాయం చేయవద్దని.

ఓ రోజు అతను రెండు గడ్డివాముల మధ్య మరదలితో స్వర్గానికి దారి వెతుక్కుంటూ వున్నప్పుడు లక్ష్మక్క ప్రత్యక్షమైంది. స్వర్గాన్నుంచి భూమిమీదకు ఒక్కమారుగా వచ్చిన చిన్నిరెడ్డికి ఏం జరుగుతుందో తెలియలేదు.

లక్ష్మక్క పేల్చిన తుపాకీగుండు ఒకటి అతని భుజాన్ని తాకింది. రెండోగుండు అతని కాలితుంటిమీద తగిలింది. హాహాకారాలు చేసుకుంటూ, క్షమించి వదిలేయమని లక్ష్మక్క కాళ్ళపైన పడ్డాడు. అవిటివాడిగా వదిలేసిందామె.




లక్ష్మక్క ఆనందానికి అవధుల్లేవు.

పెద్దిరెడ్డిని భర్త చంపాడు.

చిన్నిరెడ్డిని తాను కాలు చేయి తీసేసింది.

విచక్షణారహితంగా, పైశాచికంగా, రాక్షసత్వానికి పరాకాష్ఠగా ఎందరో స్త్రీల మానాల్ని మలినం చేసిన ఆ కిరాతకుడ్ని తాను అంతకంటే పైశాచికంగా, రాక్షసంగా అవిటివాడ్ని చేసింది.

"పిరికిపంద బతుకు కన్న
హింస వేయిరెట్లు మిన్న" కాళోజీగారు అన్న మాటలు గుర్తుకొచ్చాయి ఆమెకు.

అవధుల్లేని ఆనందాన్ని భర్తతో పంచుకుంది. తమ 'ఉనికి'కి ఒక 'విలువ' వచ్చిందనుకొంది.

ఆ ఆనందపు వేళల్లో...

ఎక్కడో, దూరంగా ఓ అబల ఆర్తనాదం.

ఓ మగవాడి భయంకరమైన అరుపులు.

ఆలాపన!

ఇంకా, ఆ పెద్దిరెడ్డి, చిన్నరెడ్డిల అకృత్యాలు చెవులబడుతూనే వున్నాయన్నమాట!

అవును, ఏళ్ళ తరబడి విన్న ఎన్నో అబలల ఆక్రందనలవి. ఎంత స్పష్టంగా వున్నాయి?

ఆలాపన కాదు.

నిజంగానే ఎవరో అబల ఆక్రందన... ...

'లే' అని మామని తోసేసి, చీర సరిచేసుకుని పరుగుతీసింది లక్ష్మక్క.

ఎవరో అమ్మాయిని పెద్దన్న విపరీతంగా విచక్షణారహితంగా పాశవికంగా కొడుతున్నాడు.

లక్ష్మక్క స్థాణువయిపోయింది.

ఏమిటని వాకబు చేసింది.

ఆ అమ్మాయి తమతో చేరి, తమ 'ఇన్ఫర్మేషన్'ని పోలీసులకందిస్తోందట.

ఆ అమ్మాయి తనకేమీ తెలియదని, వాళ్ళ ఆదర్శాలకి ఆకర్షితురాలై వాళ్ళలో చేరానని చెబుతోంది

లక్ష్మక్కకి అంతా అయోమయంగా వుంది.

అందరూ పెద్దన్ననే సమర్థిస్తున్నారు.

ఎవరో అన్నారు, ఆమెను శిక్షించి నిజం రాబట్టడాన్కి ఆ అమ్మాయిని చెరిచాడు కూడా అని.

లక్ష్మక్క నమ్మలేకపోయింది.

పెద్దన్న అంత అన్యాయం చేస్తాడా!

ఆ అమ్మాయి నిజంగా పోలీసు ఇన్ఫార్మరా?

ఐతేమాత్రం బలాత్కరించడం, బాధలుపెట్టడం సబబేనా!

ఒక్కసారిగా పెద్దిరెడ్డి గుర్తుకొచ్చాడు.

ఛా...పెద్దన్నను పెద్దిరెడ్డితో పోల్చడమేమిటి?

చెంపలేసుకుంది లక్ష్మక్క.

"ఆ గొడవలు మనకెందుకులేవే," వెంకన్న భార్యని దగ్గరకు తీసుకున్నాడు.

ఆమె భర్తతో సౌఖ్యాన్ని పంచుకోలేకపోయింది.

ఓ రోజు రవి తమ జట్టులోని ఒక పెళ్ళికాని మహిళా సభ్యురాల్ని బలవంతపెట్టడం కళ్ళారా చూసింది లక్ష్మి.

'ఛ, చిన్నిరెడ్డికి తీసిపోలేదీ రవి అన్న!' ఈసడించుకుంది ఆమె.

'అన్న' అంటే ఏవగింపు కలిగింది.

'అన్న'లు కూడా అధః పతనమయ్యారా అని ఆశ్చర్యపోయింది.

ఆ కాల్పులు, హత్యలు,దోపిడీలు...'నెత్తురు కూడు తింటున్నామా' అన్పించిందామెకు.

కొద్దిరోజుల క్రితమే మందుపాతర సంఘటనలో తమజట్టు పదిమంది పోలీసుల్ని పొట్టన బెట్టుకున్న సంఘటన గుర్తుకొచ్చింది. ఆరోజు రహదారిపై కొద్దిదూరంలో మూడు

చోట్ల మందుపాతర్లు పాతారు. రెండుచోట్ల పేలుళ్లలో పోలీసుల జీపులు చిక్కలేదు. మూడో మందు పాతర పేలింది. జీపు ధ్వంసం అయింది. ఎనిమిది మంది పోలీసులు అక్కడికక్కడే చనిపోయారు. శరీరాలు ఛిద్రమై, ఛిన్నాభిన్నమైపోయాయి. ఇద్దరు కానిస్టేబుళ్ళు గాయాలు తగిలి, ఎగిరిపడి, మళ్ళా నిలదొక్కుకుని నక్సలైట్లపైకి కాల్పులు జరిపారు. అరచి గీపెట్టినా రక్షించేవారుండరని బెదిరించి అన్నలు కానిస్టేబుళ్ళను లొంగదీసుకున్నారు. వాళ్లని ప్రాణాలతో వదిలేస్తామని నమ్మించారు. లొంగిన పోలీసులని కొద్దిసేపు ముంగాళ్ళపై కూర్చోబెట్టితే బ్యాలెన్సు తప్పిన ఓ కానిస్టేబుల్ ఎదురుగావున్న 'అన్న'పైన పడ్డాడు. అయితే, ఆయుధాన్ని లాక్కోవడానికి తనపై పడ్డాడని ఆగ్రహం చెందిన అన్నలు వాళ్లిద్దరినీ కాల్చేశారు. తర్వాత తెలిసిన నిజం ఆ పదిమందిలో ఒక ఎస్.ఐ. యితర పోలీసు అధికారుల్లా క్రూరుడు కాడని, అవినీతిపరుడు కాడని.

లక్ష్మి బాధపడింది. భర్తని, తనని దోపిడీలకో, హత్యలకో వాడుకోవడమేగానీ, యే యితర గుర్తింపు లేదు.

నాయకత్వం అప్పగించలేదు.

చదూకున్నవాళ్లే నాయకులు.

వాళ్లేం చెబితే అదే నీతి, అదే న్యాయం.

ఈ దోపిడీలు చేసి, ఎవరికి పెడుతున్నారో తెలియడంలేదు.

పల్లెటూళ్లు, పట్టణాల్లో లాగా యిక్కడ కూడా నాయకత్వం కోసం పోటీయే.

అక్కడ ఎన్నికలైనా వున్నాయి. ఇక్కడ 'కాల్పులే'!

ఏమిటో ఈ ఆటవిక న్యాయం!




ఆమె నవ్వేను చెట్లన్ని హరితమాయె
ఆమె నవ్వేను నదులు రాగములు తీసె
నగ్న నిశియైన నేమి ఆ నవ్వుతాకి
కట్టకుండునా వెన్నెల పట్టుచీరె

నాదు చేరుమాలందు ఆ నవ్వు తెరల
పరచి యిచ్చినదామె యింపార దాని
అలదుకొనగ మోమున, యెంత హాయికలిగె
అలసటంతయు చేరుమాలందుకొనెను.

గొంతులో నున్న రాగాలకోటి ఆమె
నవ్వు దివ్వెలో మున్గి స్నానాలుచేసె
సురలు ఆ గానమువిని అచ్చెరువునొందె
మా రసాంబుధి భువికెట్లు చేరెనంచు.

—డి. లక్ష్మణాచార్య


ఎక్కడైనా చిన్నచేపను పెద్దచేప మింగడమే.

ఇక్కడ 'కుల' ఆధిక్యం వుంది.

ఈ మారణహోమంలో నవయువవర్గాలు సమిధ లైపోతున్నాయి.

లక్ష్యశుద్ధి చెదిరి ఉద్యమంలో ముఠాతత్వం, వ్యక్తిగత ప్రయోజనకాంక్ష బలపడింది.

గిట్టనివాళ్లని మట్టుబెట్టడం, దళారుల నైతిక భ్రష్టత్వం పెరిగిపోయింది.




వ్యవస్థలోని దోషాలపేరిట ఏపాపం ఎరుగని వ్యక్తులని అపహరించి, హత్యలకు, అమానుష కృత్యాలకు పాల్పడడం పరిపాటయిపోయింది.

మామూలు నేరస్థులకు, అన్నలకు తేడా ఏమిటి?

భగత్సింగు, సీతారామరాజులకు వారసులమనుకున్న 'అన్న'లు యిలా అధఃపాతాళానికి ఎలా పడిపోయారు!

వసూలుచేసిన నిధులకు లెక్కలు చెప్పకపోవడం, ఇన్ఫార్మర్ల పేరుతో విచక్షణారహితంగా గిరిజనులను, దళితులను హత్య చేయడం, ఆశ్రయమిచ్చిన యిళ్లలో ఆడకూతుళ్ళని లొంగదీసుకుని అక్రమ సంబంధాలు పెట్టుకోడం, దళంలో మహిళా సభ్యుల్ని రేప్‌చేసి, పెళ్ళిళ్ళు చేసుకోవడం.....

మంచికొరకు చెడ్డదారిని ఎంచుకుని, హింసని పరమధర్మంగా విశ్వసించితే, నాయకులమనుకున్న 'అన్నలు' ఆకతాయి మూకల్లో ఒకరుగా మారారా!

ఇంత రక్తాన్ని చిందించి, యింతవరకు సాధించిందేమీలేదు.

లక్ష్మక్కకు ఏమీ బోధపడలేదు.

దీనికంటె వాళ్ళఊళ్ళో పొలం పనిచేసుకోవడమే మంచిదనిపించింది.

"మారణహోమం కన్న ప్రాయోపవేశం మిన్న" అన్న గాంధీసూక్తి గుర్తుకొచ్చింది.

ఇప్పటికైనా కళ్ళు తెరిచామనుకొంది.

"అలాగే లక్ష్మి. ప్రభుత్వం మనలాంటి వాళ్ళు లొంగిపోతే క్షమాభిక్ష యిస్తున్నారట. రేపు పోలీసులముందు లొంగిపోయి మళ్ళీ జనస్రవంతిలో కలుద్దాం" అన్నాడు వీరయ్య.

"నిజంగా మామా! ఒప్పుకుంటున్నావా?" ఆమె అతన్ని అల్లుకుపోయింది.

ఆత్మహత్యా సదృశమైన ఈ మారణకాండ నుంచి బయటపడుతున్నందుకు సంతోషించింది.

ఎక్కడ నుంచి వచ్చాయో—వాళ్ళ శరీరాల్లోకి బుల్లెట్లు దూసుకుపోయాయి.

అన్యాయాన్ని చూడలేని ఆ కళ్ళు మూతబడిపోయినాయి.

దోపిడీపై ధ్వజమెత్తిన గళం మూతబడిపోయింది.

ప్రపంచం నడుస్తూనే వుంది.

దోపిడీ సాగుతూనే వుంది.... చాలా నిశ్శబ్దంగా.

నిశ్శబ్దం......